క్లుప్తంగా

వాడాడలో వైద్య శిబిరం


రోగితో మాట్లాడుతున్న వైద్యుడు

గార: మండల పరిధిలోని వాడాడలో ఆరోగ్య సురక్షలో భాగంగా మంగళవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ కేదారినాథ్, డాక్టర్ ఫాల్గుణదీపక్, డాక్టర్ మనోజ్‌కుమార్, డాక్టర్ వీఎస్ఎన్‌మూర్తిలు రోగులకు పరీక్షలు జరిపి మందులను అందజేశారు. 45 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. 200 మందికి సాధారణ పరీక్షలు జరిపారు. వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శ్రీకూర్మం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌కుమార్ అన్నారు. సర్పంచ్ సుంకాన సురేష్, సచివాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జుంబా డాన్స్‌పై అవగాహన


జుంబా డాన్స్ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: మనిషికి చురుకైన ఫిట్‌నెస్ కోసం జుంబా డాన్స్ ఎంతో ఉపకరిస్తుందని వాకర్స్ క్లబ్ ప్రతినిధులు అన్నారు. శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో నడక సంఘాల ఆధ్వర్యంలో జుంబా డాన్స్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నడక సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ.. శరీరంలో రక్త ప్రసరణ సక్రమంగా జరగటానికి ఈ డాన్స్ ఎంతో మేలు చేస్తుందన్నారు. రక్తంలో ఆక్సిజన్ స్థాయిని మెరుగు పరచడానికి ఉపయోగపడే ఏకైక సాధనం జుంబా డాన్స్ అని ఆదిత్య వాకర్స్ క్లబ్ ప్రతినిధి హరికా అన్నారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు గేదెల ఇందిరా ప్రసాద్, వాకర్స్ ఇంటర్నేషనల్ 102 సంస్థలు డిప్యూటీ గవర్నర్ శాసపు జోగినాయుడు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం


రక్తదానం చేస్తున్న ఔత్సాహికులు

శ్రీకాకుళం కల్చరల్: ఒక వ్యక్తి చేసే రక్తదానంతో ఇద్దరి ప్రాణాలను నిలబెట్టవచ్చని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. స్థానిక రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు రవిశంకర్ గురూజీ జన్మదినోత్సవం సందర్భంగా మంగళవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానంపై ఉన్న అపోహలను విడనాడాలన్నారు. రక్తదానం చేసిన 120 రోజులలో కొత్త రక్తం వస్తుందన్నారు. రక్తదానం చేయడం వలన అనేక వ్యాధులు నయమవుతాయని వివరించారు. ఏఓఎల్ ప్రతినిధులు కె.ఎస్.ఎన్.మూర్తి, బి.వి. రవిశంకర్, వి.సుధారాణి, అందవరపు సునీల్ తదితరులు రక్తదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలోని రోగులకు సకాలంలో రక్తం అందించడానికి యువకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

అసిరితల్లి ఉత్సవాలు


అమ్మవారి దర్శనం చేసుకుంటున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలేం, బట్నవానిపేట గ్రామాల్లో మంగళవారం గ్రామ దేవత అసిరితల్లి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. దీంతో ఆయా ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది. ప్రత్యేక పూజలు గ్రామాల్లో నిర్వహించారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు.

'ప్రశాంత వాతావరణానికి సహకరించాలి'


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ రామచంద్రరావు

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి ప్రజలు సహకరించాలని జేఆర్‌పురం సీఐ జి.రామచంద్రరావు కోరారు. మండలంలోని తోటపాలేం గ్రామంలో శాంతి భద్రతలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువత, విద్యావంతులు, ప్రజలు శాంతి భద్రతలకు సహకరించాలని సూచించారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత గొడవలకు తావివ్వొద్దని స్పష్టం చేశారు. గొడవలతో విలువైన జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. గ్రామాల్లో ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకు రావాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎస్.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మికి కుంకుమార్చనలు


వైరముడి కవచధారణలో స్వామివారు


కుంకుమ పూజలందుకున్న మహాలక్ష్మి అమ్మవారు

శ్రీకాకుళం కల్చరల్: పీఎన్ కాలనీ సమీపంలోని నారాయణ తిరుమల స్వామివారి కల్యాణోత్సవాలలో భాగంగా మంగళవారం సాయంత్రం సామూహిక కుంకుమార్చనలు భక్తితో జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు నేతృత్వంలో భూనీళా సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా పూలతో అలంకరించి కల్యాణ మండపంపై ఉంచి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల సమక్షంలో అమ్మవారికి అష్టోత్తర, శతనామాలతో సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారిని వైరముడి కవచ ధారణలో భక్తులు దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో వేంకటరామానుజ సేవా దళం సభ్యులు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అలరించిన భక్తిగీతాలాపనలు


భక్తి గీతాలు ఆలపిస్తున్న గాయకులు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం నగరం కాకివీధిలో వేంచేసిన ముత్యాలమ్మతల్లి అమ్మవారి పండుగలో భాగంగా మంగళవారం ఏర్పాటు చేసిన భక్తి గీతాలాపనలు ఆహూతులను అలరించాయి. విశాఖపట్నానికి చెందిన మన్మథరావు, మంజుల ఆధ్వర్యంలో సర్వదేవతా మూర్తుల సంకీర్తనలు జరిగాయి. అలాగే ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన అమ్మవారి దేవరను అధికసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి పసుపు కుంకుమ, ముర్రాటలతో చల్లదనం చేశారు. కార్యక్రమంలో ఆలయ దమ్మల అర్చకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


దేవరను దర్శించుకుంటున్న భక్తులు

కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం

ఎచ్చెర్ల క్యాంపస్: పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం అవసరమని రీసోర్సు పర్సన్ ఎం.కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని ధర్మవరం గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం కంప్యూటర్ పరిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం ప్రాథమిక విద్య నుంచి సైతం ఆన్‌లైన్ తరగతులు వంటివి నిర్వహించాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులకు బైజ్యూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను ప్రభుత్వం సరఫరా చేస్తోందని తెలిపారు. ఉన్నత విద్య మొత్తం కంప్యూటర్‌పైనే ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం పోటీ పరీక్షలు సైతం ఆన్‌లైన్ పద్ధతిలో జరుగుతున్నాయని వెల్లడించారు.


మాట్లాడుతున్న రీసోర్స్ పర్సన్ కిరణ్‌కుమార్

విజ్ఞానానికి మాత్రమే కంప్యూటర్లు వాడాలని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మలిపెద్ది చంద్రశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

శ్రీకాకుళం అర్బన్: భారతరత్న, మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్‌గాంధీ సేవలు వెలకట్టలేనివని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు కొనియాడారు. శ్రీకాకుళంలోని ఇందిరావిజ్ఞాన్‌భవన్‌లో రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారతదేశంలో టెక్నాలజీ రంగాన్ని ప్రపంచ దేశాల మధ్య నిలిపిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కుతుందన్నారు, కంప్యూటర్, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాన్ని భారతదేశంలో ప్రవేశపెట్టి అంతరిక్ష వ్యవస్థను అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించిన గొప్ప మేధావి అని అన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థలో సమూలమైన మార్పులు తెచ్చి గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి పథంలో తీసుకొచ్చిన గొప్ప దార్శనికుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి అంబటి కృష్ణారావు, మంత్రి నరసింహమూర్తి, కె.వి.ఎల్.ఎస్.ఈశ్వరి, రెల్ల సురేష్, లుకలాపు సింహాచలం, దేశెళ్ల గోవిందమల్లిబాబు, దంత త్రినాథరావు, జి.పి.నాయుడు, రెహమాన్ ఉన్నారు.


రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

శాంతిభద్రతలకు విఘాతం లేకుండా చూడాలి

● ఇచ్ఛాపురం ఆర్వో సుదర్శన్‌దొర

ఇచ్ఛాపురం రూరల్: సార్వత్రిక ఎన్నికల కోడ్ జూన్ ఐదో తేదీ వరకు ఉంటున్న నేపథ్యంలో శాంతిభద్రతలకు ముప్పు తెచ్చే కార్యకలాపాలకు ఆస్కారం లేకుండా చూడాలని ఇచ్ఛాపురం నియోజకర్గ రిటర్నింగ్ అధికారి బి సుదర్శన్ దొర అధికారులకు సూచించారు. ఈ మేరకు ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ప్రస్తుతం 144 సెక్షన్ అమల్లో ఉన్నందున గ్రామ రెవెన్యూ సహాయకులతో దండోరా వేయించి రెండు రోజులకోసారి దండోరా రిపోర్ట్‌ను ఆయా మండల తహసీల్దార్‌కు సమర్పించాలని ఆదేశించారు. గుమిగూడి ప్రజలు ఉండరాదని, సభలు, సమావేశాలు పెట్టరాదన్నారు. పండుగల్లో డీజేల ఏర్పాటు, వీధి నాటకాలు, స్టేజి ప్రోగ్రామ్స్ పెట్టరాదని, బాణసంచా పేల్చరాదని, పెట్రోల్, డీజిల్ నిల్వలు కంటైనర్‌లో గాని, బాటిల్స్‌గాని, ఎటువంటి డ్రమ్స్ ఇతర పాత్రల్లో ఉంచరాదని ఆదేశించారు. ఈ విషయాలను అతిక్రమించిన వారిపై పోలీస్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నాలుగు మండలాల తహసీల్దార్లు, డీటీలు, ఆర్ఎస్‌డీటీలు, ఆర్ఐలు, ఇచ్ఛాపురం, సోంపేట సీఐలు టి.ఇమ్మాన్యువల్ రాజు, హెచ్.మల్లేశ్వరరావు, ఎస్సైలు ఎం.లక్ష్మణరావు, సత్యనారాయణ, హైమావతి, రాజేష్, రాము ఉన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న సుదర్శన్‌దొర

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఎచ్చెర్ల క్యాంపస్: నగరంలోని గుజరాతీపేట సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ బొంతలకోడూరు వీసీబీ మార్పు చేయనున్న కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.భయ్యన్నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కుశాలపురం పంచాయతీ, పీఎన్ కాలనీ, తోటపాలేం, కేశవరావుపేట గ్రామాల్లో ఉదయం 8 గంటలు నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, కొత్తపేట, దోమాం, వెంకన్నగారిపేట, తెప్పరేవు, ఏజీఎన్‌పేటల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటలు వరకు విద్యుత్ సరఫరా ఉండదని వెల్లడించారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అన్నదమ్ముల కొట్లాట

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని కేశవరావుపేట గ్రామానికి చెందిన అన్నదమ్ములు పాత్రుని కోటేశ్వరరావు, వెంకట సత్తిబాబు వ్యక్తిగత కక్షలు, ఆస్తి తగాదాల నేపథ్యంలో మంగళవారం ఘర్షణకు దిగారు. కర్రలతో ఒకరినొకరు కొట్టుకోవడంతో గాయపడ్డారు. ప్రస్తుతం శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. గతేడాది నుంచి ఆస్తుల కోసం వీరి మధ్య ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. ఇరువురి నుంచి ఫిర్యాదులు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేశారు.

నీలమణి దుర్గమ్మకు చల్లదనం


ముర్రాటలు తీసుకొని వెళ్తున్న మహిళలు

ఎల్.ఎన్.పేట: మండల కేంద్రంలో కొలువైన నీలమణి దుర్గ అమ్మవారికి ముర్రాటలు పోసి చల్లదనం చేశారు. లక్ష్మీనర్సుపేట గ్రామంలో వంశధార నదీతీరంలో కొలువైన బంగారమ్మ తల్లి అమ్మవారి పెద్ద పండగలు సందర్భంగా పంచాయతీ పరిధిలోని మండల కేంద్రంలో నీలమణి దుర్గమ్మకు ముర్రాటలు మంగళవారం సమర్పించారు. పంచాయతీ పరిధిలోని దక్షిణ అమ్మవారు, తరణి అమ్మవారులకు మహిళలు ముర్రాటలు పోసి చల్లదనం చేయటంతో పాటు ప్రసాదాలను సమర్పించారు. ఈనెల 28వ తేదీ వరకు బంగారమ్మ తల్లి పెద్ద పండగలను నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారి పండగలకు వచ్చే భక్తులకు, బంధువులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ముగిసిన గ్రామ దేవత ఉత్సవాలు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని లండపుట్టుగ-కమలాయిపుట్టుగ గ్రామాల్లో కొద్దిరోజులుగా జరుగుతున్న అసిరిపోలమ్మ గ్రామ దేవత నవరాత్రి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మేళతాళాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ పుర వీధుల్లో ఊరేగించి గ్రామ పొలిమేరలో ఉన్న ఆలయంలో పునః ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా వందలాది మంది ఉత్సవాలను తిలకించేందుకు తరలివచ్చారు. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.


కాంతార నృత్య ప్రదర్శన

సందడిగా ఎండల వారాలు

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం, కోమర్తి, యారబాడు, లింగాలపాడు, వీఎన్‌పురంతో పాటు పలు గ్రామాల్లో మంగళవారం ఎండల వారాలు సందడిగా నిర్వహించారు. అమ్మవారికి ముర్రాటలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వ్యవసాయ పనులు సక్రమంగా జరగాలని అమ్మవారిని కోరుకున్నారు.

ఘనంగా ధర్మాన పుట్టినరోజు వేడుకలు


మైసూర్‌లో ధర్మానకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న కార్పొరేషన్ల చైర్మన్లు, నాయకులు


శ్రీకాకుళం కల్చరల్: దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం(పీఎన్ కాలనీ)/శ్రీకాకుళం కల్చరల్/గార/ శ్రీకాకుళం రూరల్: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు పుట్టినరోజు వేడుకలను వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు మంగళవారం జరుపుకున్నారు. కర్ణాటకలోని మైసూర్‌లో, శ్రీకాకుళం నగరంలోని టౌన్‌హాల్, బెటెస్ట్ ఫిజియోథెరపీ క్లినిక్‌లో, పెదపాడులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో, గార మండలం శాలిహుండంలో నిర్వహించిన కార్యక్రమాల్లో కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. ఆలయాల్లో ధర్మాన పేరున ప్రత్యేక పూజలు చేశారు. నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో తూర్పుకాపు, కళింగవైశ్య, శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్‌లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, డి.పి.దేవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం.వి.పద్మావతి, పొన్నాడ రుషి, సాధు వైకుంఠరావు, మండవల్లి రవి, చల్ల శ్రీను, డాక్టర్ శ్రీనివాస్ పట్నాయక్, బుక్కూరు ఉమామహేశ్వరరావు, దుంగ సుధాకర్, టి.కామేశ్వరి, గుంట జ్యోతి, బిర్లంగి రామ్మోహన్‌రావు ఉన్నారు. గార మండల పార్టీ కన్వీనర్ పీస గోపి, ఎంపీపీ గొండు రఘురామ్, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, బరాటం నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ రూరల్ మండల అధ్యక్షుడు చిట్టి జనార్దనరావు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు రుప్ప దివ్య, ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతబాబు, మంత్రి కార్యాలయ ఓఎస్‌డీ రవిశంకర్, సిబ్బంది కుమార్, అనీల్, నాగరాజు ఉన్నారు.

కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరం

శ్రీకాకుళం రూరల్:

మండల పరిధిలోని నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు వెంకటాపురంలో ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ శిబిరం రెండో రోజైన మంగళవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో గ్రామీణా భాగస్వామ్య విస్తరణలో భాగంగా సామూహిక చిత్రపటం, వెన్ డయాగ్రమ్ వేసి గ్రామస్తుల స్థితిగతులను విద్యార్థులు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారిగా ఆత్మ పీడీ డాక్టర్ ఎ.రామచంద్రరావు, నైరా కళాశాల అసోసియేట్ డీన్ ఎం.భరత్ లక్ష్మి, వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త అమరజ్యోతి పాల్గొన్నారు.


సేవా కార్యక్రమంలో నైరా విద్యార్థులు

ఓట్ల లెక్కింపులో జాగ్రత్తలు వహించండి

● పలాస ఆర్వో భరత్ నాయక్

కాశీబుగ్గ: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపునకు హాజరయ్యే అభ్యర్థులు, జనరల్ ఏజెంట్‌లు తగిన జాగ్రత్తలు వహించాలని పలాస ఎన్నికల అధికారి భరత్ నాయక్ అన్నారు. పలాస ఆర్వో కార్యాలయంలో అన్నిపార్టీల ప్రతినిధులు, జనరల్ ఏజెంట్లతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. కౌంటింగ్‌లో సమయంలో తీసుకోవాలని జాగ్రత్తలను వివరించారు. వివిధ పార్టీలకు చెందిన ప్రతినిధులు అల్లు రమణ, అనీల్ రాజ్, పోతనపల్లి అప్పలస్వామి, అఖిలేష్ యాదవ్, జయదేవ్, కర్రి వెంకటరమణ, పండా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్వో భరత్‌నాయక్

జూన్ మొదటి వారం నుంచి వరి విత్తనాలు పంపిణీ

కోటబొమ్మాళి: జిల్లాలో జూన్ మొదటి వారం నుంచి ఆర్‌బీకేల ద్వారా రైతులకు ఖరీఫ్ సీజన్ కోసం రాయితీపై 28 వేల క్వింటాళ్ల వరి విత్తనాలు, డిమాండ్‌కు సరిపడా పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయడానికి చర్యలు చేపట్టామని జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీధర్ తెలిపారు. కోటబొమ్మాళి మండలం వాండ్రాడ సచివాలయంలో వ్యవసాయాధికారులు, రైతులతో విత్తనాల పంపిణీపై మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బంది లేకుండా సాంబ, స్వర్ణ, ఎంటీయూ 1061, 1224, 1121, ఆర్‌జీఎల్ 2537 రకాల వరి విత్తనాలను సిద్ధం చేసి శ్రీకాకుళం, నరసన్నపేట, కంచిలి గొడౌంలలో నిల్వ చేశామన్నారు. అన్ని ఆర్‌బీకేల్లో అగ్రికల్చరల్ అసిస్టెంట్ల ద్వారా విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని మండల వ్యవసాయాధికారులను ఆదేశించామన్నారు. జిల్లా విత్తనసంస్థ మేనేజర్ పి.బాలక్రిష్ణ, ఏడీ భవానీశంకర్, ఏవో ఎస్.గోవిందరావు, మండలంలోని 27 ఆర్‌బీకేల అగ్రికల్చరల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ శ్రీధర్

గొడవలు జరగకుండా సహకరించాలి

టెక్కలి రూరల్:

మరి కొద్దిరోజుల్లో ఎన్నికల ఫలితాలు వెల్లడి కానున్న నేపథ్యంలో గ్రామాల్లో ఎటువంటి గొడవలు జరగకుండా ప్రజలు సహకరించాలని టెక్కలి తహసీల్దార్ బాలమురళీకృష్ణ, టెక్కలి సీఐ షైడయ్య కోరారు. మండలంలోని రావివలస, బూరగాం, బొప్పాయిపురం, రామేశ్వరం గ్రామాల్లో మంగళవారం ప్రజలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్నికల ఫలితాల అనంతరం గ్రామాల్లో ఎటువంటి వివాదాలకు తావివ్వవద్దని విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియాలో వివాదాస్పద వ్యాఖ్యలు, కవ్వింపు చర్యలకు పాల్పడవద్దన్నారు. వివాదాలకు చోటిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. విజయోత్సవ వేడుకల్లో నిబంధనలు పాటించాలన్నారు. వివాదాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నామన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉందని.. ప్రజలు గుమిగూడి ఉండవద్దని విజ్ఞప్తి చేశారు. పెట్రోల్ బంకుల్లో లూజ్ పెట్రోల్ విక్రయాలు చేపట్టవద్దన్నారు. కాగా రావివలస గ్రామంలో 12 మంది, టెక్కలి కోదండరామవీధిలో ఆరుగురుపై బైండవర్ కేసులు నమోదు చేసినట్లు సీఐ షైడయ్య తెలిపారు. టెక్కలి ఎస్ఐ లక్ష్మి, ఎస్ఐ-2 వెంకటేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.


రావివలసలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు